సాక్షి ఖమ్మం

బుధవారం । 16 । ఆగస్టు । 2023



భారీ పతాకాలతో ప్రదర్శన

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ జాతీయ పతాకాలతో ప్రదర్శనలు నిర్వహించారు. 8లో



కృష్ణయ్య సేవలు మరువలేనివి

తెల్దారుపల్లి ప్రాంత అభివృద్ధికి తమ్మినేని కృష్ణయ్య చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 34° / 25°

జిల్లాలోని కొన్నిచోట్ల బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. జిల్లా అంతటా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

గోల్కొండ కోటలో ఎంపీలు



వేడుకల్లో పాల్గొన్న ఎంపీలు నామ, రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లోని చారిత్రక గోల్కొండ కోటలో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యాన మంగళవారం స్వాతంత్య్ర వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు రాయితీ



రాయితీ టికెట్లు ఇస్తున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా సీనియర్ సిటిజన్లకు 50శాతం రాయితీ ప్రకటించారు. ఈసందర్భంగా ఖమ్మం బస్టాండ్‌లో పలువురికి ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న టికెట్లు అందజేశారు. తొలుత ఆయన ఆర్‌ఎం కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేశారు. అలాగే, అత్యుత్తమ పనితీరు కనబరిచిన 18మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పూర్తి



పోటీల్లో పరుగెడుతున్న అథ్లెట్లు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి మిడిల్, లాంగ్ డిస్టెన్స్ పరుగు పందెం పోటీలు నిర్వహించారు. జిల్లా జట్లను ఎంపిక చేసేందుకు నిర్వహించిన ఈ పోటీలకు 50 మంది అథ్లెట్లు హాజరుకాగా, ఇక్కడ ఎంపికైన వారు 20వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అండర్-14 బాలికల విభాగంలో డి. సుమైత్రి, ఎస్.సాయిప్రశాంతి, అండర్-16లో డి.సాగరిక, జె.మైథిలి, అండర్-16 బాలురలో కె.మస్తాన్, అండర్-20 బాలురలో యు.రాకేష్, బి.బాలు, పురుషుల విభాగంలో ఎల్.విక్రం ఎంపికయ్యారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహించగా సీనియర్ కోచ్ ఎం.డీ.గౌస్, అసోసియేషన్ కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు ఎం.సుధాకర్, సాల్మన్‌రాజ్, ఎలిజిబిత్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

అజయ్‌తండా వాసికి రజిత పతకం



రామకృష్ణకు పతకం అందజేస్తున్న సీఐఎస్‌ఎఫ్ డైరెక్టర్ సునీల్

నేలకొండపల్లి: కేంద్రీయ పారిశ్రామిక భద్రతా దళంలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ భూక్యా రామకృష్ణకు రజిత పతకం లభించింది. నేలకొండపల్లి మండలం అజయ్‌తండాకు చెందిన ఆయన 1994లో కేంద్రీయ పారిశ్రామిక భద్రత దళంలో చేరారు. ఢిల్లీలో జరిగే స్వాతంత్ర, గణతంత్ర పరేడ్లలో ఇప్పటివరకు 15 సార్లు పాల్గొన్నారు. ఈమేరకు హైదరాబాద్‌లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో సీఐఎస్‌ఎఫ్ డైరెక్టర్ సునీల్ ఇమ్మానియేల్ ఆయనకు రజిత పతకం అందజేసి సన్మానించారు.

రామయ్యకు పునర్వసు పట్టాభిషేకం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకాన్ని ఘనంగా జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని, అనంతరం పట్టాభిషేక మహోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

స్వాతంత్య్రోద్యమంలో విశిష్టస్థానం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో జిల్లాకు విశిష్ట స్థానం ఉంది. జమలాపురం కేశవరావు, హీరాలాల్ మోరియా, గెల్లా కేశవరావు తదితర ప్రముఖులు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి స్వేచ్ఛాయుత జీవితాన్ని మనకు ప్రసాదించిన భరతమాత బిడ్డల సేవలను నిత్యం స్మరించుకోవాలి' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. 77వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంత్రి జాతీయ పతాకాన్ని ఎగురవేసి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి పువ్వాడ చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

సంక్షేమం, అభివృద్ధిలో జిల్లాదే అగ్రస్థానం

- ఖమ్మంలో మున్నేరుపై రూ.180 కోట్లతో తీగల వంతెన
- సత్తుపల్లి, పాలేరుకు నర్సింగ్ కళాశాలల మంజూరు
- ఈనెల 19నుంచి మైనార్టీ బంధు ప్రారంభం
- స్వాతంత్య్ర వేడుకల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

వైద్య సౌకర్యాలు మెరుగు

జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేయడంతోపాటు అనుబంధంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. రూ.166 కోట్లతో మౌలిక వసతుల కల్పన, నూతన భవనాల నిర్మాణం చివరిదశకు చేరగా ఈ ఏడాది నుంచే వంద సీట్లతో వైద్య కళాశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని సత్తుపల్లి, పాలేరుకు నర్సింగ్ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే వ్యాధుల నిర్ధారణకు రూ.2.15 కోట్లతో సీ.టీ. స్కాన్‌ను అందుబాటులోకి తెచ్చాం. కంటివెలుగు రెండో విడత ద్వారా జిల్లాలో 6,44,133 మందికి పరీక్షలు చేసి.. 1,99,998 మందికి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశాం.

మారిన పాఠశాలల రూపురేఖలు

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించేందుకు 'మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో మొదటి విడతగా 426 పాఠశాలల్లో రూ.178 కోట్ల వ్యయంతో అన్ని వసతుల కల్పించేందుకు చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతీ పాఠశాలకు డ్యూయల్ డెస్కులు, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటుచేశాం.

చెక్‌డ్యామ్‌లు, ప్రాజెక్టులు

జిల్లాలో 54 చెక్‌డ్యాంల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు వచ్చాయి. ఇందులో మొదటగా 24 నిర్మాణాలు చేపట్టగా 16 పూర్తయ్యాయి. ఇక సీతారామ ఎత్తిపోతల పథకం కింద పాలేరు లింకు కాల్వ ద్వారా 47,381 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీటి వసతి కల్పించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

వ్యవసాయానికి పెద్దపీట

రైతుబంధులో భాగంగా ఈ ఏడాది వానాకాలం 3,06,709 మంది రైతుల ఖాతాల్లో రూ.268.55 కోట్లు జమ చేశాం. ఈ ఏడాది మార్చిలో కురిసిన అకాల వర్షాలతో జిల్లాలోని 23,632 ఎకరాల్లో పంటలకు నష్టం జరగగా, ఎకరానికి రూ.10 వేల చొప్పున 18,913 మంది రైతుల ఖాతాల్లో రూ.23.58 కోట్ల పరిహారం జమ అయింది. జిల్లాలో ఇప్పటి వరకు 40,334 మంది రైతులకు సంబంధించి రూ.93.19 కోట్ల రుణమాఫీ పూర్తయింది.

సంక్షేమ బాట

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రారంభించిన బీసీ బంధు ద్వారా జిల్లాలో 14,808 మందిని అర్హులుగా గుర్తించారు. ఇప్పటి వరకు 1,460 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందింది. అర్హులైన వారందరికీ ప్రతినెలా 1,500 మంది చొప్పున ఆర్థిసాయం మంజూరు చేస్తాం. గొర్రెల పంపిణీకి సంబంధించి రెండో విడతలో 226 యూనిట్లు గ్రౌండింగ్ పూర్తికాగా, వారానికి 114 యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. మైనార్టీలకు రూ.లక్ష సాయం పథకం ఈనెల 19న ప్రారంభమవుతుంది. అలాగే, సొంత నివాస స్థలం కలిగిన పేదలకు ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి ద్వారా రూ.3 లక్షల మంజూరు చేయనుండగా, జిల్లాలో 78,467 దరఖాస్తులు అందాయి.



పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

రహదారులు, భవనాల శాఖ పరిధిలో..

రహదారులు, భవనాల శాఖ పరిధిలో రూ.2,014.57 కోట్లతో 376 పనులు మంజూరు కాగా.. రూ.1,080.46 కోట్ల విలువైన 271 పనులు పూర్తయ్యాయి. రూ.201.294 కోట్లతో 3,601 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. నగరంలోని మున్నేరు నదిపై రూ.180 కోట్లతో తీగల వంతెన నిర్మాణం టెండర్ దశలో ఉంది. రూ.3 కోట్లతో నేలకొండపల్లిలో భక్తరామదాసు జ్ఞాన మదిరం నిర్మాణ పనులు కూడా తుది దశలో ఉన్నాయి. మున్నేరు, ఆకేరు పాలేరు, వైరా నదులు, ఇతర వాగులపై బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లు పది మంజూరు కాగా.. ఇందులో ఎనిమిది పూర్తయ్యాయి. రూ.1,039 కోట్లతో కోదాడ-ఖమ్మం మధ్య 31.800 కి.మీ. నాలుగు వరుసల జాతీయ రహదారికి గాను ఇప్పటి వరకు 15.10 కి.మీ. మేరకు పూర్తయింది.

మెరుగైన వసతుల కల్పన

ఖమ్మం నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ నగరానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాం. ముఖ్యమంత్రి హామీ నిధులు రూ.100 కోట్లతో గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ పనులు తుదిదశకు చేరాయి. నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లలో 200 కిలోమీటర్ల సైడ్ డ్రెయిన్ పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.2.05 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో సత్తుపల్లిలో అవని, జైవీర్ పార్కుల అభివృద్ధి, మధిరలో రూ.4.50 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయింది. జీఓ నెంబర్ 58 కింద 3,253 దరఖాస్తులు ఆమోదించి పట్టాలు జారీ అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ, జెడ్పీ, సుడా, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, లింగాల కమల్‌రాజ్, బచ్చు విజయ్‌కుమార్, దోరెపల్లి శ్వేత, రైతుబంధు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే పామాయిల్ ఫ్యాక్టరీ

కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో టీఎస్ఐఐసీ ఆధ్వర్యాన గోద్రేజ్ వారిచే పామాయిల్ ఫ్యాక్టరీ కోసం 125 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వచ్చేనెల ప్రారంభం కానున్నాయి. కాగా, పువ్వాడ ఫౌండేషన్ ద్వారా ఖమ్మం నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలనే ఆలోచనతో గత నెల 10 నుంచి ఉచితంగా జారీ ప్రక్రియ చేపట్టాం.



కూసుమంచి టీఎస్‌డబ్ల్యూజేసీ విద్యార్థుల నృత్యం



అభినయ రుద్ర నాట్యాలయం విద్యార్థుల ప్రదర్శన

ఆకట్టుకున్న శకటాలు



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ శకటం

అభివృద్ధి పథకాలను వివరించేలా రూపకల్పన

జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా శాఖల వారీగా ప్రదర్శించిన శకటాలు (వాహనాలు) ఆకట్టుకున్నాయి. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యాన జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను కళ్లకు కట్టేలా శకటాలను రూపొందించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలతో పాటు డీఆర్డీఏ, వైద్య, ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. - ఖమ్మం సహకారనగర్

నెల రోజుల్లోగా రైతులకు సాగునీరు

ఎస్సారెస్పీ కాల్వల తవ్వకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందాల



ఎమ్మెల్యే కందాలను సత్కరిస్తున్న సీఈ శంకర్‌నాయక్

కూసుమంచి: పెండింగ్‌లో ఉన్న శ్రీరాంసాగర్ 7 ఆర్ కాల్వల తవ్వకం శరవేగంగా పూర్తిచేసి నెల రోజుల్లోగా ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. కూసుమంచి వద్ద పెండింగ్‌లో ఉన్న కాల్వ తవ్వకం పనులను జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, రైతులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిహారం పెంచేలా తాను ప్రభుత్వాన్ని ఒప్పించడంతో పదేళ్ల సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు. ఈసందర్భంగా సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేను సీఈ శంకర్‌నాయక్, రైతులు సత్కరించారు. ఈఈ వెంకటేశ్వర్లు, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్‌తో పాటు ఇంటూరి శేఖర్, రామసహాయం బాలకృష్ణారెడ్డి, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేయించిన ఎమ్మెల్యే

పాలేరు రిజర్వాయర్ నుండి పాలేరు కాల్వకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సాగునీరు విడుదల చేయించారు. ప్రస్తుతం కాల్వ కింద వరినాట్లు వేస్తుండగా అధికారులు నీటిని నిలిపేయడంతో రైతులు ఎమ్మెల్యేను కలిశారు. దీంతో ఆయన సీఈ శంకర్‌నాయక్‌తో మాట్లాడి రిజర్వాయర్ వద్దకు తీసుకెళ్లి నీటిని విడుదల చేయించారు.

నేటి నుంచి లెప్రసీ సర్వే

- ఈనెల 31లోగా ఇంటింటా వివరాలు సేకరణ
- జిల్లాలో 1,345 బృందాల ఏర్పాటు
- సర్వే వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు
- ఈ ఏడాది ఇప్పటివరకు ఇరవై కేసులు నమోదు



శరీరంపై మచ్చలను పరీక్షిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఖమ్మంవైద్యవిభాగం: జాతీయ లెప్రసీ(కుష్ఠు వ్యాధి) నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం నుండి ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) పేరిట ఈనెల 31 వరకు కార్యక్రమం కొనసాగుతుంది. ఇందుకోసం జిల్లాలో 1,345 బృందాలను నియమించారు. ఏఎన్‌ఎం పర్యవేక్షణలో ఆశ కార్యకర్త, మరో వలంటీర్ ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారు. బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఎవరి శరీరంపైన మచ్చలు ఉన్నాయా, ఉంటే అవి ఏ రకం మచ్చలో పరీక్షించి సర్వే పూర్తయిన ఇళ్లకు మార్క్ చేస్తారు. ఆయా బృందాలు సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా కుష్ఠు బాధితుల సమాచారం తెలిసిపోతుంది. తద్వారా నేరుగా వారి ఇళ్లకు వెళ్లి మందులు పంపిణీ చేస్తూ వ్యాధి నిర్మూలనకు పాటుపడతారు.

అవగాహన లేకపోవడంతోనే...

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం ఇరవై కుష్ఠు కేసులు నమోదయ్యాయి. ఏప్రిల్ నుండి జూలై వరకు ఈ కేసులు వెలుగు చూశాయి. అలాగే 2021-22 ఏడాదిలో 120 కేసులు, 2022-23 ఏడాదిలో 116 కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా తిరుమలాయపాలెం, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లో కేసులు నమోదవుతున్నట్లు గుర్తించగా.. ప్రజల్లో అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఈనేపథ్యాన జిల్లాలో కుష్ఠు వ్యాధిని పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.

మైక్రో బ్యాక్టీరియం లెప్రేతో వ్యాప్తి

కుష్ఠు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే సూక్ష్మ క్రిమి వల్ల సంక్రమిస్తుంది. ప్రధానంగా ఇది చర్మం, నరాలకు సోకుతుంది. అయితే, వ్యాధి లక్షణాలు బహిర్గతమయ్యేందుకు సగటున మూడు నుండి ఐదేళ్లు పడుతుంది. ఈ వ్యాధి వంశపారంపర్యంగా రాకున్నా... వయస్సు, లింగభేదం లేకుండా ఎవరికైనా సోకే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. కుష్ఠువ్యాధి మచ్చలు సహజ చర్మపు రంగు కంటే తక్కువ, స్పర్శ లేని ఎర్రని రాగి లేదా గోధుమ రంగు కలిగి ఉంటాయి. కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, చెమట రాకుండా వచ్చే మచ్చలతో పాటు చేయి లేదా పాదాల వేళ్లు వంకర పోవడం ఈ వ్యాధి లక్షణం. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభిస్తే ఆరు నెలల నుంచి 12నెలల్లో పూర్తిగా నయమవుతుంది. రెండు లేక మూడు ఔషధాల కలయిక అయిన బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) చేస్తారు. ఈ చికిత్స అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిగా ఉచితంగా లభిస్తుంది.

పూర్తిగా రూపు మాపేందుకే...

కుష్ఠు వ్యాధి కేసులు గతంలో మాదిరి తీవ్రంగా పెరగడం లేదు. అయినప్పటికీ వ్యాధిని పూర్తిస్థాయిలో రూపుమాపేందుకు ప్రభుత్వం ఎల్‌సీడీసీ నిర్వహిస్తోంది. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరగా నయమయ్యే అవకాశముండడంతో ఇంటింటి సర్వేకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వ్యాధి నిర్మూలనకు మైకుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

8వేల క్యూసెక్కుల నీరు విడుదల

పాల్వంచరూరల్ : ఎగువన కురిసిన వర్షాలతో పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయానికి వరద వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్‌లోకి మంగళవారం ఎగువ ప్రాంతాల నుంచి 400 క్యూసెక్కుల వరద నీరు రాగా, నీటిమట్టం 404 అడుగులకు చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 8వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ సురేష్ తెలిపారు. కిన్నెరసాని దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

వర్షంతో పత్తికి జీవం

ఎరువులు వేసే పనిలో రైతుల బిజీబిజీ

గత నెలలో దంచిన కొట్టిన వానలు ఈ నెల మళ్లీ ముఖం చాటేశాయి. దీంతో పత్తి మొక్కలు వడలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. ఈనేపథ్యాన మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం పత్తి పంటకు జీవం పోసింది. దీంతో రైతులు పంటకు ఎరువులు వేయడంలో నిమగ్నమయ్యారు. ఇక మిర్చి తోటలు కూడా వేసేందుకు సిద్ధమవుతున్న రైతులకు ఈ వర్షం అనుకూలించిందనే చెప్పాలి. - తిరుమలాయపాలెం



తిరుమలాయపాలెంలో పత్తికి వేసేందుకు ఎరువు సిద్ధం చేస్తున్న రైతు

క్లుప్తంగా

పోలీసులపై రేవంత్‌రెడ్డి విమర్శలు సరికాదు

ఖమ్మంక్రైం: పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా విమర్శించేలా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరికాదని దీనిని జిల్లా పోలీస్ అధికారుల సంఘం బాధ్యులు పేర్కొన్నారు. రాజకీయ మెప్పు కోసం మహబూబ్‌నగర్ పోలీసులను చులకన చేస్తూ విమర్శించడం తగదని తెలిపారు. తెలంగాణ పోలీసులకు దేశంలోనే మంచి గుర్తింపు ఉందని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల ఆదరాభిమానాలు పొందుతుండగా నిరాధార ఆరోపణలు చేయొద్దని సంఘం బాధ్యులు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

సాయుధ పోరాట యోధురాలు మృతి


పున్నమ్మ (ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పెద్దపాక పున్నమ్మ (99) మంగళవారం మృతి చెందింది. ఆమెకు ఐదుగురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. పున్నమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొనడమే కాక భూమి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన కమ్యూనిస్టు ఉద్యమంలోనూ పాలుపంచుకున్నారు. ఆమె మృతదేహం వద్ద సర్పంచ్ పెద్దపాక గురువయ్య, వివిధ పార్టీల నాయకులు కే.వీ.రెడ్డి, మరికంటి రేణుబాబు, గుడవర్తి నాగేశ్వరరావు, భాస్కర్‌రావు మల్లేశ్వరరావు, పుల్లయ్య, వీరస్వామి, నారాయణ, పెద్దపాక వెంకటేశ్వర్లు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి పరిహారం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారానికి చెందిన తోట పద్మ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఈమేరకు విద్యుత్ శాఖ నుంచి ఆమె కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం మంజూరైంది. ఈ చెక్కును మంగళవారం పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అందజేశారు. అలాగే, అప్పలనరసింహాపురానికి చెందిన పిల్లి రాజేష్ జేఈఈ మెయిన్స్‌లో ర్యాంక్ సాధించచగా ఎమ్మెల్యే రూ.10 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు. విద్యుత్ శాఖ ఏడీ కోక్యానాయక్, ఏఈ కె.రామారావు, మార్కెట్ చైర్మన్ శాంత, ఎంపీపీ వజ్జా రమ్య పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య

మధిర: మధిరలోని శివాలయం వీధికి చెందిన వేల్పుల గోకుల్ (20) సోమవారం అర్ధరాత్రి మధిర రైల్వేస్టేషన్ సమీపాన గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన గోకుల్‌ను కుటుంబసభ్యులు మందలించారు. దీంతో ఆయన బయటకు వెళ్లి గూడ్స్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, గోకుల్ ఫ్లెక్సీ షాపులో పనిచేస్తున్నాడు.

గొలుసు, నగదు చోరీ

ఏన్కూరు: గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బంగారు గొలుసు సహా చోరీ చేసిన ఘటన మండలంలోని గార్లఒడ్డులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దగుంట్ల నర్సింహారావు ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. ఈమేరకు నర్సింహారావు సోదరి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు, ఇద్దరి పర్సుల్లోని రూ.27 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాదావత్ రవి తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ఎస్టీ కాలనీకి చెందిన గుగులోతు సుజాత(35) జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. కొద్ది రోజుల క్రితం జ్వరం బారిన పడిన ఆమెకు నాలుగు రోజుల నుండి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇంతలోనే పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడుకు చెందిన రైతు తాళ్లపల్లి రామయ్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా పత్తి కాలిపోయింది. రామయ్య మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద శబ్దం రావడంతో ఉలిక్కిపడి లేచి పరుగులు తీశారు. ఇంతలోనే నిప్పు రవ్వలు పత్తిపై పడడంతో రెండు క్వింటాళ్లకు పైగా పత్తి కాలిపోయింది.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

తల్లాడ: మండలంలోని ముద్దునూరులో మంగళవారం విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు గోరంట్ల శ్రీను తన పొలంలో రెండు ఎద్దులతో దుక్కి దున్నిస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండడం, 11 కేవీ సపోర్ట్ వైరుకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో దాన్ని తాకిన దుక్కిటెద్దు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈమేరకు రూ.70వేల విలువైన ఎద్దు మృతి చెందిందని రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

ఉత్తములకు ప్రశంసాపత్రాలు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో వివిధ శాఖల్లో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన 191 మంది ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం పోలీస్ పరేడ్ మైదానంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందించారు. అలాగే, ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన గ్రామాల సర్పంచ్, కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరాం, సీపీఓ శ్రీనివాస్, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ బి.రంజిత్‌కుమార్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ పి.దుర్గాప్రసాద్ తదితరులతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి పాల్గొన్నారు.


జెడ్పీ సీఈఓ అప్పారావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, సీపీ విష్ణు ఎస్.వారియర్, ఎమ్మెల్సీ మధుసూదన్


ప్రశంసాపత్రం అందుకుంటున్న కోయచలక సర్పంచ్, కార్యదర్శి హరిప్రసాద్, శృతి


బుగ్గపాడు సర్పంచ్ జయేందర్‌రావు, కార్యదర్శి


వేడుకల్లో అదనపు కలెక్టర్ అభిలాష, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ తదితరులు


తొడితలగూడెం సర్పంచ్ కుమార్, కార్యదర్శి ఉమ


కొమ్మినేపల్లి సర్పంచ్ దుర్గాజ్యోతి, కార్యదర్శి


స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి అజయ్


అవార్డులు స్వీకరిస్తున్న ఉద్యోగుల పేర్లు వరుసగా... కె.శ్రీరామ్, జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి, వి.శ్రీనివాస్, సీపీఓ, బి.రంజిత్‌కుమార్, కలెక్టరేట్, పి.దుర్గాప్రసాద్, ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్, జీ.వీ.సర్పాంబ, కలెక్టరేట్, పి.బి.కల్యాణి, గిర్దావర్, క్రాంతికుమార్, గిర్దావర్, సీహెచ్.రమేష్, గిర్దావర్, బి.రవి, గిర్దావర్, డి.వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్, ఖమ్మం అర్బన్


పి.కృష్ణ, కలెక్టర్ గన్‌మెన్, సంతులాల్, ఆఫీస్ సబార్డినేట్, బి.నాగలక్ష్మి, మార్కెట్ సూపర్‌వైజర్, ఎ.వెంకటమురళి, హెడ్‌వార్డర్, ఎం.శృతి, డీసీఓ ఆఫీస్, వి.హన్మంతరావు, ఎక్సైజ్ కానిస్టేబుల్, కె.అపర్ణ, హార్టికల్చర్ ఆఫీసర్, జి.పద్మ, ఫార్మసిస్ట్, ఎం.డీ.యాకూబ్‌పాషా, కంప్యూటర్ ఆపరేటర్, జి. ప్రవీణ్, ఆర్‌ఎండీవీ, ఏఈఈ, పి.ప్రవీణ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్, బి.శ్రీను, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, డి.రమేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, జి.నీలిమ, బీసీ సంక్షేమ శాఖ, వై.మంజుల, సబ్ ట్రెజరీ ఆఫీసర్, కె.ప్రసన్నకుమార్, డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీస్, కుసుమరేఖ, మధిర ట్రెజరీ ఆఫీస్, డి.రమణ, హెచ్ఎం, మూలపోచారం, అబ్దుల్ నిసార్, సివిల్ సప్లయిస్ డీటీ, వి.రోజా, జూనియర్ అసిస్టెంట్, జి.రామచందర్, సూపరింటెండెంట్, కె.రుక్మారావు, హెచ్‌డబ్ల్యూఓ


సీహెచ్.శ్రీనివాస్, లైబ్రేరియన్, కె.సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఫైర్ స్టేషన్ డ్రైవర్, జి.కమలకుమారి, ఏపీఎంఓ, హిమసింధు, ఏఈఈ, రామలింగేశ్వరరావు, ఏఈఈ, నవీన్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్, ఎస్.రాంబాబు, డ్రైవర్, పి.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ మేనేజర్, బి.నరేందర్, కానిస్టేబుల్, ఇ.రాజు, కానిస్టేబుల్, కె.రాధాకృష్ణ, కానిస్టేబుల్, వెంకట్రామిరెడ్డి, ఏఈ, పబ్లిక్‌హెల్త్, వి.ఇలిక స్రవంతి కారుణ్య, మెడికల్ ఆఫీసర్, సురేష్, మెడికల్ ఆఫీసర్, అజయ్, కేఎంసీ జవాన్, కె.అనిల్, కేఎంసీ వర్కర్, అశోక్, కేఎంసీ వర్కర్, ఇటికాల భాస్కర్, సుడా టీపీబీఓ, అమన్, సుడా చైర్మన్ సీసీ, కె.కృష్ణకుమారి, సీడీపీఓ, కే.వీ.రామారావు, సీనియర్ అసిస్టెంట్, ఆర్.పుల్లారావు, డీఎల్‌పీఓ


పి.రాజారావు, ఎంపీఓ, కె.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, షేక్ ఇమాంవలి, పంచాయతీ కార్యదర్శి, ఎన్.చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, కె.రేఖ, పంచాయతీ కార్యదర్శి, ఆర్.రామకృష్ణ, ఎంపీడీఓ, వీ.డీ.వీ.అశోక్‌కుమార్, ఎంపీడీఓ, ఎ.మహాలక్ష్మి, ఎంపీడీఓ, వి.శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పి.మురళీమోహన్, సర్వేయర్, రాములునాయక్, సివిల్ సర్జన్, టి.పవన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఎ.రాధ, స్టాఫ్ నర్స్, ఎన్.చంద్రశేఖర్, రేడియోగ్రాఫర్, ఎం.డీ.అక్తర్‌అలీ, వాలీబాల్ కోచ్, పి.పరిపూర్ణాచారి, ఉషూ కోచ్, వి.సుబ్బారావు, ఏడీ, అగ్రికల్చర్, బి.కిషోర్‌బాబు, ఏఓ, ఖమ్మంఅర్బన్, శిరణ్మయి, ఏఈఓ, ఇ.ఉపేంద్ర, ఎస్సీ కార్పొరేషన్, బి.రాము, ఏఈఈ, ఉదయప్రతాప్, డీఈఈ


జి.సుశీల, కండక్టర్, ఎస్.సుజాత, ఏఈ, ఎన్‌పీడీసీఎల్, పి.మల్లయ్య, ప్రిన్సిపాల్, కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, మిత్ర ఫౌండేషన్, బి.రత్తయ్య, ఫుడ్ టెక్నాలజిస్ట్, బి.నర్సయ్య, డ్రైవర్, వి.రమ్య, ఎక్సైజ్ సీఐ, ఎస్.కే.రబ్బానీ, ఎక్సైజ్ ఎస్సై, ఎం.సరిత, ఎక్సైజ్ ఎస్సై, టి.బెంజిమెన్, హెడ్ వార్డర్, ఎ.రవీంద్రబాబు, సబ్ రిజిస్ట్రార్, జి.సుధాకర్‌రావు, కానిస్టేబుల్, కె.ప్రసాదరావు, కానిస్టేబుల్, డి.రాజేష్, పీసీ, కె.వెంకటేశ్వర్లు, ఏఆర్ పీసీ, వి.హన్మంతరావు, ఏఎస్సై, వై.కృష్ణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్, బి.అశోక్‌కుమార్, ఏఆర్ పీసీ, ఎం.డీ.ఉమర్, సీనియర్ అసిస్టెంట్, డి.రవికుమార్, హెడ్ కానిస్టేబుల్, సృజన, డిస్ట్రిక్ట్ మేనేజర్, సదియా తస్నీమ్, మెడికల్ ఆఫీసర్

సంక్షేమ పథకాలు, పట్టాల పంపిణీ

ఖమ్మం సహకారనగర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు చెక్కులు, మంజూరు పత్రాలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్ అధికారులు, ప్రజాప్రతినిధులకు వీటిని అందజేశారు. ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు, తిరుమలాయపాలెం, తల్లాడ మండలం కుర్నవల్లి, వేంసూరు మండలం భరణిపాడు, నేలకొండపల్లి మండలం మోటాపురం లబ్ధిదారులకు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి గిరివికాసం పథకం ద్వారా పెనుబల్లి మండలం పార్థసారథిపురం, ఏన్కూరు మండలం జన్నారం ఎస్టీ కాలనీల్లోని 21 మందికి మోటార్లు, వైరా, మధిర నియోజకవర్గాల్లోని పలువురికి వాహనాలు అందజేశారు. ఇంకా గొత్తికోయల చేతిలో హతమైన ఎఫ్‌ఆర్వో శ్రీనివాసరావు సతీమణి భాగ్యలక్ష్మికి రఘునాథపాలెం మండలంలో ఇంటి స్థలం కేటాయింపు పత్రాల అందజేశాయగా, మున్నేరు వరదల సమయాన ముంపు ప్రాంతాల్లో సేవలందించిన 46 మంది గజ ఈతగాళ్లను సన్మానించారు. అలాగే, గౌతమి జిల్లా మహిళా సమాఖ్య, 1,249 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.105 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేశారు. కాగా, జిల్లాలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించేందుకకు పరేడ్ మైదానంలో ఏర్పాటుచేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి.


మహిళా సమాఖ్య బాధ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్, కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్సీ మధు, మేయర్ నీరజ, డీఆర్‌డీఓ విద్యాచందన


ఇళ్ల స్థలాల పట్టాలు అందుకున్న వారితో మంత్రి పువ్వాడ, తదితరులు

భారీ పతాకాలతో ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖమ్మంలో 600 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. త్రీటౌన్‌కు చెందిన తారకరామ ఆటోనగర్‌కు చెందిన ఫోర్ వీలర్స్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సభ్యులు ఈ ప్రదర్శన నిర్వహించగా ఆర్జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ ప్రారంభించారు. ఆటోనగర్ అధ్యక్షుడు మహంకాళి మల్లికార్జున్‌రావుతో పాటు కేసగాని రవి, పాషా, గంగవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంలో 600 అడుగుల జాతీయ జెండాతో...

77 జెండాలు.. 2,280 అడుగుల జాతీయ జెండా

సత్తుపల్లి: సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా టెక్నోస్కూల్ విద్యార్థులు 77 జాతీయ జెండాలు చేబూని.. 2,280 అడుగుల పొడవైన జాతీయ పతాకం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశనాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, ఎంపీపీ హైమావతి, పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు వెంకటేశ్వరరావుతో పాటు రాధిక, చల్లగుండ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.


సత్తుపల్లిలో మదర్‌థెరిస్సా టెక్నోస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

బోడెపుడి ట్రస్ట్ ఆధ్వర్యాన...

ఖమ్మంఅర్బన్: బోడెపుడి ట్రస్ట్ ఆధ్వర్యాన ఖమ్మంలో 2వేల మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇందిరానగర్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లారు. ట్రస్ట్ చైర్మన్ బోడేపూడి రాజాతో పాటు విక్రమ్, అనిల్, వెంకటేష్, రిత్విక్, పి.నితీష్, ఆఫ్రిద్, అఫ్రోజ్, సుమన్, అశోక్ పాల్గొన్నారు.


బోడెపుడి ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రదర్శనలో...

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఖమ్మంసహకారనగర్: పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి గేయాలను నృత్యప్రదర్శనలు ఇచ్చారు. దానవాయిగూడెం ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, కూసుమంచి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌జేసీ, హార్వెస్ట్, కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలతో పాటు మరికొన్ని విద్యాసంస్థల విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు అలరించాయి.


జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు


ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్


కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు


బీజేపీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ


సీపీఐ జిల్లా కార్యాలయంలో పాల్గొన్న నాయకులు

పార్టీ కార్యాలయాల్లో జెండా వందనం

జిల్లాలోని రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతం ఆలపించాక జెండా వందనం చేశారు. ఈసందర్భంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి త్యాగాలను స్మరించుకున్నారు.


మధిరలోని కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, నాయకులు

ప్రభుత్వ కార్యాలయాల్లో ..

సాక్షి నెట్‌వర్క్: కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్ జాతీయ జెండా ఎగురవేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డి.మధుసూదన్‌నాయక్, ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు క్యాంపు కార్యాలయంలో కూడా కలెక్టర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అలాగే, కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు. బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు పాల్గొన్నారు. జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ లింగాల కమల్‌రాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించాక గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ అప్పారావు, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు. పోలీసు కమిషనరేట్‌లో సీపీ విష్ణు ఎస్.వారియర్, రవాణా శాఖ కార్యాలయంలో ఆర్‌టీఓ తోట కిషన్‌రావు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎంవీఐ వరప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు. మెడికల్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు జాతీయ జెండా ఎగురవేశారు.


కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్లు


కోర్టులో జెండా ఎగురవేస్తున్న జిల్లా జడ్జి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్


కమిషనరేట్‌లో జాతీయ గీతం ఆలపిస్తున్న సీపీ విష్ణు ఎస్.వారియర్, ఉద్యోగులు


జెండా ఆవిష్కరిస్తున్న ఆర్‌టీఓ కిషన్‌రావు


మెడికల్ కళాశాలలో జెండా ఎగురవేస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు


జలవనరులశాఖ కార్యాలయంలో జెండా ఎగురవేసి మాట్లాడుతున్న సీఈ శంకర్‌నాయక్


జెడ్పీలో గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న చైర్మన్ కమల్‌రాజ్, తదితరులు


ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన ఎస్ఈ సురేందర్, అధికారులు


జిల్లా లైబ్రరీలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న చైర్మన్ ఉమామహేశ్వరరావు

ఉప ఎన్నికల్లోనూ సగానికిపైగా ఏకగ్రీవాలు

- 66 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుంటే 32 ఏకగ్రీవం.. మరో 32 చోట్ల పోటీ

సాక్షి, అమరావతి: ఏపీలో 484 మండలాల పరిధిలో మొత్తం 1,033 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో సగానికి పైగా స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 66 సర్పంచ్ స్థానాలతో పాటు 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. పదో తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగగా, సోమవారం సా.3 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అన్ని జిల్లాల నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు.. సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగే మొత్తం 66 గ్రామాల్లో 32 చోట్ల ఎన్నిక ఏకగ్రీవం కాగా, రెండుచోట్ల అభ్యర్థులెవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. కేవలం 32 చోట్ల మాత్రమే సర్పంచ్ స్థానాలకు ఈనెల 19న పోలింగ్ జరగనుంది. మరోవైపు.. 1,064 వార్డు సభ్యులకు ఉప ఎన్నికలు జరుగుతుండగా.. 757 స్థానాలు ఏకగ్రీవం కాగా, 261 చోట్ల 19న పోలింగ్ జరగనుంది.

పుంగనూరు నిందితులంతా పాత నేరస్తులు

దాడుల కోసం పార్టీలో గూండాలను ఎంపిక చేసి మరీ తెచ్చిన టీడీపీ

సాక్షి, చిత్తూరు, పుంగనూరు (చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా పుంగనూరులో ఇటీవల తెలుగుదేశం పార్టీ సృష్టించిన విధ్వంసంలో విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. పక్కా ప్రణాళిక, భారీ వ్యూహంతోనే ఈ దాడులు జరిగినట్లు స్పష్టమవుతోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపడం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా అణగదొక్కటమే లక్ష్యంగా టీడీపీ ఈ దాడులకు వ్యూహ రచన చేసింది. పక్కా ప్రణాళికతో జిల్లా నలుమూలల నుంచి టీడీపీకి చెందిన గుండాలను ఎంపిక చేసి మరీ పుంగనూరుకు తెచ్చినట్లు వెల్లడైంది. వారిపై జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. వీరిని ముందుగానే మారణాయుధాలతో సహా పుంగనూరులో మోహరించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అంటరానితనంపై యుద్ధం

విజయవాడలో 77వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఏపీ సీఎం వైఎస్ జగన్

"అంటరానితనం అంటే ఫలానా వ్యక్తులు తాకటానికి వీల్లేదని భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు.. వారికి అందాల్సిన సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే.. అలాంటి రూపం మార్చుకున్న అంటరానితనంపై ఈ రోజు మనం యుద్ధం చేస్తున్నాం! పేదలు గెలిచేదాకా, వారి బతుకులు బాగుపడే వరకు ఇది కొనసాగుతుంది." - ఏపీ సీఎం వైఎస్ జగన్

- భౌతికంగా దూరం పెట్టడం ఒక్కటే కాదు.. సంక్షేమాన్ని అడ్డుకోవడం కూడా అంటరానితనమే
- మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించి సాయుధ దళాల వందనాన్ని స్వీకరించిన సీఎం


విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రూపం మార్చుకున్న అంటరానితనం, పేద వర్గాలను అణచివేస్తున్న పెత్తందారీ భావజాలం ధోరణులపై ఈ నాలుగేళ్ల పాలనలో యుద్ధాన్ని ప్రకటించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం జగన్ సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మహనీయుల త్యాగనిరతి, స్వాతంత్ర్య సమర యోధుల బలి దానాలను గుర్తు చేస్తూ ప్రసంగించారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో మరే ప్రభుత్వం, రాష్ట్రం చేయని గొప్ప మార్పులు, గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థాన్ని నాలుగేళ్లలోనే తెచ్చామని చెప్పారు. '76 ఏళ్ల ప్రయాణంలో మన దేశం, రాష్ట్రం ఎంతో పురోగమించాయని చెప్పేందుకు పలు ఉదాహరణలు కనిపిస్తాయి. ఆర్థిక వ్యవస్థకు మూలమైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు లాంటి మూడు రంగాలలో ఎంతో ప్రగతి కనిపిస్తుంది. కానీ అదే సమయంలో ఈ వేగాన్ని అందుకోలేని, అందుకునే అవకాశాలు తగినంతగా లభించని కుటుంబాలు, వర్గాలు, సామాజిక వర్గాలు, ప్రాంతాలు ఈ ఏడు దశాబ్దాల ప్రయాణంలో ఇంకా వెనకబడే ఉన్నాయి' అని పేర్కొన్నారు. సీఎం జగన్ తన ప్రసంగంలో ఇంకా ఏమన్నారంటే..

రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలం..

అంటరానితనం అంటే కేవలం భౌతికంగా దూరం పెట్టటం మాత్రమే కాదు! పేదలు ఏ బడిలో చదువుకుంటున్నారో ఆ గవర్నమెంట్ బడిని పాడు పెట్టడం! డబ్బున్న వారి పిల్లలకు ఒక మీడియం, పేదల పిల్లలకు మరో మీడియం అని వివక్ష పాటిస్తూ పేద బిడ్డలు తెలుగు మీడియంలోనే చదవాలని బరితెగించి వాదించటం కూడా అంటరానితనమే! పేదలు ఏ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారో అక్కడ ఉచిత సేవలు అందకుండా చేయటం, పేదలు ఏ బస్సు ఎక్కుతున్నారో ఆ బస్సును ప్రైవేట్‌కు విక్రయించాలని చూడటం, పేదలు కోరుకునే చిన్నపాటి ఇంటి స్థలం, ఇంటిని వారికి ఇవ్వకుండా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటం, చివరికి కోర్టుల్లో రకరకాల కేసులు వేసి పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇవ్వటానికి వీల్లేదని అడ్డుకోవటం కూడా అంటరానితనమే! పౌర సేవలు ఏవి కావాలన్నా పేదలు, మధ్యతరగతి వర్గాల వారు కార్యాలయాలు, కమిటీల చుట్టూ తిరిగేలా వారి సహనాన్ని పరీక్షించటం, అవ్వాతాతలు పెన్షన్ అందుకోవాలన్నా, రైతన్నలకు ఎరువులు కావాలన్నా పొద్దున్నే లేచి పొడవాటి క్యూల్లో నిలబడి, చివరికి ఆ క్యూ లైన్లలో మనుషులు చనిపోతున్నా పాలకుల గుండెలు కరగకపోవటం... ఇవన్నీ రూపం మార్చుకున్న అంటరానితనం, పెత్తందారీ భావజాలంలో భాగాలే. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా ఇప్పటికీ అలాగే మిగిలి ఉన్న, రూపం మార్చుకున్న అంటరానితనంపై యుద్ధం చేస్తున్న ప్రభుత్వం మనది. పేదలు గెలిచే వరకూ, వారి బతుకులు బాగుపడేవరకూ ఈ యుద్ధం కొనసాగుతుంది.


మెడల్స్ ప్రదానం సందర్భంగా కింద పడిపోయిన మెడల్‌ను తీసి పోలీస్‌కు పిన్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దుష్ట సంప్రదాయాన్ని తుదముట్టించాం

ఎన్నికల సమయంలో ప్రకటించే మేనిఫెస్టోను ఆ తరువాత చెత్తబుట్టలో పడేసే దుష్ట సంప్రదాయాన్ని మనం తుదముట్టించాం. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ ఇందులో ఇవి చెప్పాం.. ఇవి చేశాం.. 98.5 శాతం వాగ్దానాలను ఇప్పటికే అమలు చేశామని ప్రింట్ తీసి మరీ గడపగడపకూ వెళ్లి చూపిస్తూ ప్రజల ఆశీస్సులు తీసుకుంటున్నాం. సామాజిక న్యాయం అన్నది కేవలం నినాదం కాదు.. అది అమలు చేయాల్సిన విధానమని నిరూపిస్తూ మంత్రి మండలిలో ఏకంగా 68 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే ఇచ్చాం. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే. వికేంద్రీకరణను విధానంగా మార్చుకుని రాష్ట్రం ఏర్పడిన తరవాత మరో 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేశాం. రాజధానులను కూడా మూడు ప్రాంతాల హక్కుగా, రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా వికేంద్రీకరణ చేయబోతున్న ప్రభుత్వం కూడా మనదే. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలు మాత్రమే లబ్ధిదారులైన ప్రజలకు చేరుతున్నాయని దాదాపు 38 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని చెప్పిన మాటలు ఇప్పటికీ ప్రచారంలో ఉన్నాయి. గత 50 నెలల్లో ఎలాంటి అవినీతి, లంచాలు, వివక్షకు తావు లేకుండా ఏకంగా రూ.2.31 లక్షల కోట్లను అత్యంత పారదర్శకంగా పేదలకు అందించాం. డీబీటీతో నేరుగా ఖాతాల్లోకి జమ చేశాం. సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకే ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం. మహిళా సాధికారతకు బాటలు వేశాం. సోషల్ ఆడిట్‌ను తప్పనిసరి చేయటం ద్వారా పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తున్నాం.

2047 నాటికి | ఏపీని నంబర్ వన్ చేస్తా

- అభివృద్ధి ఆలోచనలన్నీ నావే
- హైదరాబాద్‌లో స్కూల్ నుంచి వర్సిటీ వరకు నేనే అభివృద్ధి చేశా
- అవినీతి, నేరాల్ని కాపాడుకుంటే సంక్షేమం పరుగులు పెడుతుంది
- సంస్కరణల ఫలితంగా కోవిడ్‌లోనూ గ్రోత్ వచ్చిన రాష్ట్రం ఇండియా
- ఇంజనీరింగ్ చేయాలంటే బైపీసీ చదవాలి
- ఇండియా విజన్–2047 డాక్యుమెంట్ ఆవిష్కరణలో చంద్రబాబు




సాక్షి, విశాఖపట్నం: మళ్లీ తనని అధికారంలోకి తీసుకొస్తే.. 2047 నాటికల్లా ఆంధ్రప్రదేశ్‌ని నంబర్ వన్ చేస్తానని, తనని గెలిపించే బాధ్యత మీరు తీసుకుంటే అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. చంద్రబాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్‌ఎస్టీ) సంస్థ రూపొందించిన ఇండియా విజన్–2047 డాక్యుమెంట్‌ని ఆయన మంగళవారం విశాఖ ఎంజీఎం గ్రౌండ్స్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటేనే సంక్షేమం పరుగులు పెడుతుందని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చినా అవినీతి పోలేదని, అందుకే ఫ్రీ ఫ్రం కరెప్షన్, ఫ్రీ ఫ్రం క్రైమ్ అనే నినాదంతో ముందుకెళ్దామని అన్నారు. పీపుల్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ4) మోడల్‌తో పేదరికం లేని సమాజం సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. బటన్ నొక్కడం వల్ల ఎవరికి లాభమో చూడాలే తప్ప, ఉత్తుత్తి బటన్‌లు నొక్కడం కాదన్నారు. విద్యుత్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, టెలికమ్యూనికేషన్, హైవేల నుంచి దేశంలో అమలైన ప్రతి ఒక్కటీ తన ఆలోచనే అని చెప్పారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు తన వల్లే అభివృద్ధి చెందాయన్నారు. డబ్బులు ఎలా సంపాదించాలో చాలా మందికి నేర్పించానన్నారు.

విజన్ డాక్యుమెంట్ అట్టర్‌ఫ్లాప్

ఇండియా విజన్–2047 పేరుతో చంద్రబాబు చేసిన షో అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్న సభలో చెప్పిన మాటలే చెప్పి, తానే గొప్పంటూ డబ్బా కొట్టుకొని, అందలోనూ సవాలక్ష తప్పులు చెప్పడంతో అందరూ మధ్యలోనే వెళ్లిపోయారు. చంద్రబాబు మాట్లాడుతుండగానే 80 శాతం ఖాళీ అయిపోయింది. ఆయన రావడమే రెండు గంటలు ఆలస్యం. వచ్చీ రాగానే అడ్డగోలు అబద్ధాలు చెబుతుండటంతో అందరూ వినుక్కొంటూ వెళ్లిపోయారు. ఆర్థిక సంస్కరణల ఫలితంగా కోవిడ్ సమయంలోనూ గ్రోత్ వచ్చిన ఏకైక రాష్ట్రం భారత్ అని చెప్పడంతో అందరూ నవ్వుకున్నారు. హైదరాబాద్‌లో ఎలిమెంటరీ స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు అన్నీ తానే అభివృద్ధి చేశానని, ఆర్థిక సంస్కరణలకు బాటలు వేశానని, విద్యుత్ నుంచి రోడ్ల వరకూ ఎలా డెవలప్ చెయ్యాలో కేంద్రానికి రిపోర్టులు ఇచ్చిందీ తానే అని అనడంతో అందరూ విస్తుపోయారు. ఇంటర్‌లో ఇంజినీర్ కావాలంటే బైపీసీ చదవాలని చెప్పడంతో అందరికీ బుర్రలు తిరిగిపోయాయి. అవినీతి, నేరాల్ని కాపాడుకుంటనే సంక్షేమం పరుగులు పెడుతుందని ఓ సందర్భంలో చెప్పడంతో విన్న వారందరూ అవాక్కయ్యారు.

ఇక విజన్ 2047పై దృష్టి

- మహిళా నేతల సమావేశంలో పవన్‌కళ్యాణ్
- ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని హామీ



సాక్షి, అమరావతి: విజన్–2020 అయిపోయిందని.. ఇకపై విజన్–2047పై దృష్టి పెట్టాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం పార్టీ మహిళా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజన్ 2047 గురించే ఇప్పుడు అందరూ మాట్లాడుతున్నారన్నారు. ప్రస్తుతం 2023 నడుస్తోందని.. 2047 నాటికి ఉపాధి అవకాశాలు బాగుండాలని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తాను కోరుకుంటున్నానన్నారు. పెరుగుతున్న సంపద అంతా రాజకీయాల్లోకి వచ్చి పదవులు పొంది దోపిడీ చేసే కొందరి వద్దే పేరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి కట్టినా ముఖ్యమంత్రులకు కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని.. ఆంధ్రాలో అయితే 8 శాతం అంటున్నారన్నారు. సరైన వ్యక్తులకు ఓటు వేయకపోతే 2047 కల్లా మన బిడ్డలను మనమే సర్వనాశనం చేసుకుంటామని వ్యాఖ్యానించారు.

పథకాలేవీ ఆగవు

వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకపోతే పథకాలు ఆగిపోతాయేమో.. సంక్షేమం నిలిచిపోతుందేమో అనుకోవద్దని పవన్ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రస్తుత పథకాల కంటే పదింతలు ఎక్కువగా గొప్ప పథకాలే ఉంటాయి తప్ప ఈ పథకాలు తీసేసే పరిస్థితి ఉండదన్నారు. ప్రతి ఒక్కరికీ మాట ఇస్తున్నానని.. జగన్‌ను ఎన్నుకోకపోతే ఏం జరుగుతుందో అనే మాట అవసరం లేదన్నారు.

జిల్లా వార్తలు

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య


తిరుమల ఆలయం వద్ద కుటుంబంతో ఎమ్మెల్యే సండ్ర


కేసీఆర్‌కు ప్రసాదం అందచేస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి: తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామి వారిని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకోగా అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాత్రి హైదరాబాద్ చేరుకున్న ఎమ్మెల్యే సండ్ర.. సీఎం కేసీఆర్‌ను కలిసి తిరుమల ప్రసాదం అందించడంతో పాటు తన పుట్టినరోజు సందర్భంగా ఆశీస్సులు తీసుకున్నారు.

కిన్నెరసానిలో మువ్వన్నెల రెపరెపలు


త్రివర్ణ పతాకంతో రిజర్వాయర్‌లో తిరుగుతున్న స్పీడ్‌బోట్

పాల్వంచరూరల్: పంద్రాగస్టు సందర్భంగా పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. టూరిజం కార్పొరేషన్‌కు చెందిన స్పీడ్ బోట్‌కు త్రివర్ణ పతాకాన్ని కట్టి జలాశయంలో తిప్పిన ఆపరేటర్లు, సిబ్బంది దేశభక్తిని చాటుకున్నారు.

ఒక్క రోజు ఆదాయం రూ.47,625

పంద్రాగస్టు సందర్భంగా కిన్నెరసానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా 1,005మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.29,475తో పాటు 300మంది జలాశయంలో బోటు షికారు చేయడంతో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.18,150 ఆదాయం సమకూరింది.

మహనీయుల త్యాగాలు నిత్య స్మరణీయం

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్


భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన మహనీయుల త్యాగాలు నిత్య స్మరణీయమని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్‌రాజ్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వారి జీవిత పాఠాలను నేటి విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాగా, గిరిజనులకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఐటీడీఏ ద్వారా అందేలా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు భీమ్, మణెమ్మ, తానాజీ, విజయ్‌కుమార్, సురేశ్‌బాబు, అశోక్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, రమణయ్య, మునీర్‌పాషా తదతరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

అనేక మంది త్యాగమే స్వాతంత్ర్యం

సింగరేణి(కొత్తగూడెం): ఎందరో మహనీయుల త్యాగఫలితమే నేటి స్వాతంత్ర్యమని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ వెల్లడించారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆయన గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాక జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే, సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ జాతీయ జెండా ఎగురవేశారు. కాగా, ప్రకాశం స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సింగరేణివ్యాప్తంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని డైరెక్టర్లు బలరాం, శ్రీనివాస్ సన్మానించి మాట్లాడారు. అనేక పోరాటాలు, ఎందరో త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించగా.. స్వరాష్ట్ర నినాదంతో తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిలో 33 శాతం వృద్ధి, రవాణాలో 39శాతం వృద్ధి సాధించామని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణతో పాటు అధికారులు, నాయకులు కట్టా బసవయ్య, బి.హన్మంతరావు, బి.వెంకట్రావ్, రియాజ్ అహ్మద్, త్యాగరాజన్, మందా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో గౌరవవందనం స్వీకరిస్తున్న డైరెక్టర్ బలరాం

డీసీసీబీలో..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని బ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు సాధించిన ప్రగతి, వివిధ వర్గాలకు ఇస్తున్న రుణాలు, రాయితీల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.


ఖమ్మం డీసీసీబీలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న చైర్మన్ నాగభూషణం, తదితరులు

కృష్ణయ్య సేవలు మరువలేనివి..

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లికి చెందిన తమ్మినేని కృష్ణయ్య ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెల్దారుపల్లిలో మంగళవారం జరిగిన కృష్ణయ్య ప్రథమ వర్ధంతి సభలో తుమ్మల పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కృష్ణయ్య అనునిత్యం గ్రామాభివృద్ధికి పరితపించేవారని, ఆయన లేనిలోటు ప్రజలకే కాక తనకూ తీర్చలేనిదని చెప్పారు. కృష్ణయ్య కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణయ్య ఈ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమ, కార్మికుల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తుచేశారు. తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు. నాయకులు సాధు రమేష్‌రెడ్డి, బండి జగదీష్, జొన్నలగడ్డ రవికుమార్, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు తదితరులు పాల్గొన్నారు.


వర్ధంతి సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వనజీవి రామయ్యకు పెరిగిన వేతనం


రామయ్య దంపతులకు రూ.50 వేల చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంసహకారనగర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యకు ఇప్పటి వరకు రూ.40 వేల గౌరవ వేతనం అందుతోంది. ఈ నగదును మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు వినియోగిస్తున్నారు. తాజాగా ఈ వేతనాన్ని రూ.50 వేలకు పెంచగా.. అందుకు సంబంధించిన చెక్కును ఖమ్మంలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అందజేసి రామయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, డీఆర్డీఓ విద్యాచందన, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వీరుల త్యాగాలతోనే స్వాతంత్ర్యం

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: ఎందరో వీరులు ప్రాణాలకు తెగించి చేసిన పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం లభించిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని రఘునాథపాలెంలో మంగళవారం ఆయన జాతీయ జెండా ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుడు తక్కెళ్లపల్లి మీనారావు విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశం కోసం పోరాడిన వారిని స్మరించుకునేందుకు మేరా మిట్టీ.. మేరీ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అమరులు నడయాడిన ప్రాంతాల నుంచి మట్టిని సేకరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నైజాం నవాబును ఎదిరించి ప్రాణత్యాగం చేసిన ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ విగ్రహానికి సుబ్లేడులో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, మేక సంతోష్‌రెడ్డి, బొడ్డుపల్లి ప్రసాద్, మునేశ్, శరత్, వీరభద్రం, గోవర్ధన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


సుబ్లేడులో షోయబుల్లాఖాన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీధర్‌రెడ్డి, నాయకులు